
ఈనాడు
రాజన్న సిరిసిల్ల





మానేరు తీరంలో సందడి

# బంగారు బతుకమ్మ ఉయ్యాలో..



బతుకమ్మతో యువతులు





సిరిసిల్లలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చందుర్తిలో..

జిల్లాలో సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు తంగేడు, గునుగు, పట్టుకుచ్చులు, చామంతి, బంతి పూలతో బతుకమ్మలను పేర్చారు. సిరిసిల్ల పట్టణవాసులు మానేరు నదీ తీరానికి చేరుకున్నారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం మానేరు నదీ తీరంలోని బతుకమ్మఘాట్‌లో నిమజ్జనం చేశారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ మహిళలు, యువతులు బతుకమ్మలతో ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లకు చేరుకుని ఆడిపాడారు.

- న్యూస్‌టుడే, సిరిసిల్ల(విద్యానగర్)



ముస్తాబాద్‌లో..



తంగళ్లపల్లిలో...



బతుకమ్మల నిమజ్జనం

అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు

## ముఖ్యమంత్రికి ఆహ్వానం

### మర్యాద పూర్వకంగా కలిసిన విప్ ఆది శ్రీనివాస్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, చిత్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**వేములవాడ, న్యూస్‌టుడే:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ఆహ్వానించారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు విప్ వెల్లడించారు. వేములవాడ కేంద్రంగా నూలు డిపో మంజూరు చేస్తూ రూ.50 కోట్లు కేటాయించడం, గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం జీవో మంజూరు చేయడం పట్ల సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**రుద్రంగి, న్యూస్‌టుడే:** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఐపీఎస్ అధికారి భూక్య రాంరెడ్డి నాయక్ పేర్కొన్నారు. రుద్రంగి మండలం బడితండాలో గురువారం నిర్వహించిన 5 కె రన్ మారథాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్తు పదార్థాలు యువత భవితను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. వాటికి దూరంగా ఉంటూ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల వైపు దృష్టిసారించాలని సూచించారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పరుగు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు మహేందర్‌నాయక్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.




విజేతలతో నిర్వాహకులు తదితరులు

# రుణ దందా.. ఆగేదుందా?

**● పేదలపై మైక్రో ఫైనాన్స్ సంస్థల ఒత్తిడి ● జిల్లాలో తరచూ వెలుగుచూస్తున్న సంఘటనలు**

ఈనాడు, సిరిసిల్ల



***జిల్లాలో వస్త్ర పరిశ్రమలో పని చేసే కార్మికులు, ఇంట్లోని మహిళలు గార్మెంటు ఉత్పత్తులు, బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషించుకునేవారే ఎక్కువ. చిన్నపాటి కుటుంబ అవసరాలకు మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తుంటారు. ఎన్‌బీఎఫ్‌సీ (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ) ధ్రువీకరణతో నడిచేవి జిల్లా వ్యాప్తంగా ఏడు ఉన్నాయి. ఇవి పట్టణాలు, మండల కేంద్రాల్లో సుమారు 204 గ్రూపులకు పైనే రుణాలిచ్చాయి.***

● తంగళ్లపల్లి మండలం కేసీఆర్ కాలనీలో నివాసముంటున్న మరమగ్గాల కార్మికుడు జులైలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతని భార్య పేరున మైక్రో ఫైనాన్స్ సంస్థలో లక్ష రూపాయల రుణం తీసుకున్నాడు. కొన్ని రోజులు వాయిదాలు చెల్లించారు. మధ్యలో నెల ఆలస్యమైంది. ఫైనాన్స్ సిబ్బంది ఇంట్లోనే బైఠాయించడంతో అవమాన భారంతో ఆత్మహత్యకు యత్నించాడు.

● కేసీఆర్ కాలనీలోని మరో నేత కార్మికుడు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫైనాన్స్ సంస్థలో రూ.40 వేల రుణం తీసుకున్నారు. వస్త్రోత్పత్తుల ఆర్డర్లు లేక రెండు నెలలుగా అరకొర ఉపాధితో కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో వాయిదాలు చెల్లించడంలో ఆలస్యమైంది. సంస్థ ప్రతినిధుల ఒత్తిడి కారణంగా ఈ దారుణానికి పాల్పడ్డాడు.

☛ పది మంది మహిళలను ఒక గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. వీరిలో ఒకరిని అధ్యక్షులుగా నియమించి ఒప్పందం చేసుకుంటారు. ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు ఇస్తారు. రుణ వాయిదాల చెల్లింపునకు వారం, పదిహేను, నెల రోజులు గడువు ఇస్తారు. రూ.10 వేలు రుణం తీసుకున్న వారికి ప్రాసెసింగ్, బీమా చెల్లింపులు పోను చేతికొచ్చేది రూ.9,600. వారానికి రూ.255 చొప్పున 50 వారాలు చెల్లించాలి. అలాగే లక్ష రూపాయల రుణం తీసుకుంటే వారానికి రూ.2,250 చొప్పున చెల్లించాలి. ఒకవేళ రుణం తీసుకున్న సభ్యులు మృతి చెందితే బీమా డబ్బులతో రికవరీ చేసుకుంటారు.

☛ వాయిదా చెల్లించాల్సిన రోజు ఉదయం ఫైనాన్స్ సంస్థ వారు గ్రూపు అధ్యక్షుల ఇంటికి వస్తారు. అక్కడే డబ్బులు వసూలు చేసుకుంటారు. ఇక్కడ సభ్యుల్లో ఏ ఒక్కరు రుణ వాయిదా చెల్లించకపోయినా మిగతా వారు ఆమె వాయిదాను చెల్లించాలి. లేకుంటే ఎంత సమయమైనా వారు అక్కడి నుంచి కదలరు. ఇదీ వారి నిబంధన.

### తనిఖీలు చేస్తాం

జిల్లాలోని మైక్రోఫైనాన్స్ సంస్థలు ఆర్‌బీఐ రుణ నిబంధనలు పాటించడం లేదు. ఈ సంస్థల కార్యాలయాలన్నింటిని త్వరలోనే తనిఖీలు చేస్తాం. ఫైనాన్స్ నిర్వాహకులు ఇంట్లోకి వెళ్లి తీసుకున్న రుణాలు చెల్లించాలని ఒత్తిడి చేయడం, వేధింపులకు గురిచేయడం చేయొద్దు. ఇలాంటి సంస్థలపై పూర్తి అధ్యయనం చేసి, ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. **- మల్లికార్జున్, ఎల్‌డీఎం**

☛ బ్యాంకుల్లో ఆస్తి పత్రాలు, ఆభరణాలు తనఖా పెట్టడం, పూచీకత్తు వంటివి చూపించాలి. ఫైనాన్స్ సంస్థలు ఇంటికే వచ్చి ఆధార్ కార్డుపైనే రుణాలు ఇస్తుంటారు. దీంతో కార్మిక వాడల్లో వీరి వద్ద రుణాలు తీసుకునేవారు పెద్ద మొత్తంలో ఉన్నారు. కొన్ని నెలలుగా వస్త్ర పరిశ్రమ ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. అంతంత మాత్రంగా వచ్చిన ఆర్డర్లతో చేతినిండా పని లభించడం లేదు. దీంతో కార్మికులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించలేకపోతున్నారు.

☛ 2008లోనూ నేత కార్మికుల ఆత్మహత్యలకు మైక్రో ఫైనాన్స్ సంస్థలే కారణమని తేలడంతో అప్పటి ప్రభుత్వం వీటిపై మారటోరియం విధించింది. ఇటీవల కాలంలో జిల్లా వ్యాప్తంగా మళ్లీ విస్తరిస్తున్నాయి.

## వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించండి



హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

**వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే:** ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది రోజూ సమయపాలన పాటించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఐపీ, ఓపీ, ల్యాబ్, మందులు అందించే గది, ఆసుపత్రి ఆవరణ, రక్త పరీక్షలు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. రోజూ ఓపీ ఎంత వస్తుందని అడిగి తెలుసుకున్నారు. డెంగీ, గన్యా, మలేరియా తదితర కేసులపై ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, త్వరలో ఆరోగ్య కేంద్రాల్లో హాజరు కోసం బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## మహాగౌరీ అలంకారంలో అమ్మవారి దర్శనం



**వేములవాడ, న్యూస్‌టుడే:** దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం మహాగౌరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి చతుష్షష్టి పూజలను ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డి మండపంలో గాయత్రి జపం, చండీహోమం, గాయత్రి హవనం అర్చకులు వేద మంత్రాలతో జరిపించారు. శ్రీరాజరాజేశ్వరి వద్ద దుర్గాష్టమి సందర్భంగా చండీ కలశ ప్రతిష్ఠ, చండీ హవన కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి మహిషాసుర మర్దిని అమ్మవారికి మహాపూజను అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాత్రి వర్షం కారణంగా స్వామివార్ల పెద్ద సేవ కార్యక్రమాన్ని ఆలయ అధికారులు రద్దు చేశారు.

## నేడు, రేపు రాజన్న ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు

**వేములవాడ, న్యూస్‌టుడే:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహార్నవమి, శనివారం విజయ దశమి సందర్భంగా ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్వామివారి గర్భాలయంలో జరిగే భక్తుల అభిషేకాలు, అన్నపూజలు, ఆకు పూజలు, పల్లకీ సేవ, పెద్దసేవ, కుంకుమ పూజలు వంటి ఆర్జిత సేవలన్నీ రద్దు చేసినట్లు వెల్లడించారు. భక్తులు గమనించాలని కోరారు.

## శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు

**సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే:** సిరిసిల్ల పట్టణంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని శేష వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మారుతీరావు, అర్చకులు పాల్గొన్నారు.

# సురక్షిత సేవకులు

### మంచి నీటి సహాయకుల నియామకం

న్యూస్‌టుడే, సిరిసిల్ల పట్టణం

మిషన్ భగీరథ ఇంట్రా (గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం) ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మంచి నీరు సరఫరా అవుతుంది. గ్రామ పంచాయతీల్లో పని చేసే మల్టీపర్పస్ కార్మికుల్లో ఒకరు నీటి సరఫరా, ట్యాంకుల నిర్వహణను చూస్తున్నారు. చాలా మందికి నీటి నిర్వహణపై అంతగా అవగాహన లేదు. బోరు మోటార్లు, చేతిపంపులు మరమ్మతులతోపాటు క్షేత్రస్థాయిలో పెద్ద సమస్యలు, లీకేజీలు ఏర్పడితే నిపుణులను ఆశ్రయించేవారు. మరమ్మతుల్లో కొంత ఆలస్యం కారణంగా నీటి సరఫరాలో అవాంతరాలు ఎదురయ్యేవి. అప్పటి వరకు నీరు వృథాతోపాటు కలుషితమయ్యేది.


● పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్లు పగిలి నీరు కలుషితమై ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

● నీరు కూడా పెద్ద మొత్తంలో వృథా అవుతుంది. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది.

● ప్రతి గ్రామానికి ఒక బహుళ నైపుణ్యం కలిగిన కార్మికుడిని, మేజర్ పంచాయతీలకు ఇద్దరు చొప్పున ఎంపిక చేసి వారికి నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నల్ జల్ మిత్ర పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది.

● పంచాయతీల్లో పని చేసే మల్టీపర్పస్ కార్మికులు, ఆసక్తి కలిగిన సామాజిక సేవా స్పృహ కలిగిన ఉత్సాహవంతులను ఎంపిక చేసింది. వారికి మంచినీటి సరఫరా సహాయకులుగా బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

● గత నెలలో జిల్లా నుంచి నైపుణ్యం కలిగిన నలుగురిని ఎంపిక చేసి వారికి గత నెలలో హైదరాబాద్‌లో నాలుగు అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. తర్ఫీదు పొందిన మాస్టర్ ట్రైనర్‌లు విడతల వారీగా జిల్లాలోని 262 మందికి ట్యాంకులు, పైపులైన్‌లు, చేతిపంపులు, బోరుమోటార్ల నిర్వహణపై మంచి నీటి సహాయకులకు శిక్షణ ఇచ్చారు. నేర్చుకున్న అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా వివరించారు.





### సత్వర పరిష్కారం...

చాలా రోజులుగా మూలకు చేరిన చేతి పంపుల మరమ్మతులకు మోక్షం లభించనుంది. లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమై రంగు మారిన నీరు నల్లాల ద్వారా వచ్చేది.

● కిట్ల సాయంతో నిత్యం నీటి నాణ్యతను పరీక్షించనున్నారు. ప్రమాణాలు లోపిస్తే విషయాన్ని అధికారులకు తెలియజేస్తారు. సంబంధిత అధికారుల సూచనల ప్రకారం చర్యలు తీసుకుంటారు.

● సింగిల్, త్రీఫేజ్ మోటారు సామర్థ్యం, నిర్వహణ, విద్యుత్తు కనెక్షన్, చిన్న చిన్న సాంకేతిక సమస్యలపై తర్ఫీదు పొందారు. తాగునీటి పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడితే మరమ్మతుల కోసం సంబంధిత సిబ్బంది వచ్చే వరకు ఆగాల్సి వచ్చేది. నీరు వృథాగా పోయేది. ప్రస్తుతం శిక్షణ పొందిన సహాయకులతో సత్వర పరిష్కారం లభించనున్నది.



మంచినీటి సహాయకులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

### ప్రతి ఇంటికీ రక్షిత నీరు

ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీటి సరఫరా లక్ష్యంగా కృషి చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లాలోని మల్టీపర్పస్ కార్మికులతోపాటు సామాజిక సేవా దృక్పథం ఉన్న ఉత్సాహవంతులను ఎంపిక చేశాం. వారికి నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చాం. చేతిపంపులు, బోరుమోటార్లు, ట్యాంకులు, పైపులైన్ అంశాలపై తర్ఫీదు ఇచ్చాం. స్థానికంగా ఏ చిన్న సమస్య వచ్చిన ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడకుండా సహాయకులే మరమ్మతులు చేసేవిధంగా వారిని తీర్చిదిద్దాం.

- జానకి, మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ

| జిల్లా వివరాలు | మండలాలు | గ్రామ పంచాయతీలు | నీటి ట్యాంకులు | పైపులైన్ల విస్తీర్ణం | మంచినీటి సహాయకులు |
|---|---|---|---|---|---|
| | 12 | 255 | 592 | 1,222 కిలో మీటర్లు | 262 |

# విహారం.. వినోదం.. వికాసం



జీవితం పరుగులమయమైంది. పొద్దున లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు పని ఒత్తిళ్లు.. ఆలోచనలు చుట్టుముట్టేస్తున్నాయి. పిల్లలైతే బడికి వెళ్లిరావడం.. హోంవర్కు, అంటూ రాత్రి వరకు మేల్కొని ఉంటున్నారు. సెలవులు వచ్చాయంటే చాలు ఇంట్లో వారందరికీ కొద్దిగా విరామం లభిస్తుంది. హమ్మయ్య.. కాస్త తీరిక దొరికిందనే భావన వచ్చేస్తుంది. కుటుంబ సంక్షేమం.. వినోదం.. ఆనందం గురించి ఆలోచించేవారు కొద్దిగా బయటకు వెళ్లి రావాలని భావిస్తున్నారు. ఇటీవల చాలా కుటుంబాలు ఇష్టమైన ప్రదేశాలకు వెళ్లి వస్తున్నారు. జిల్లా నుంచి మొదలుకొని విదేశాల వరకు పర్యటిస్తున్నారు. దసరా సెలవుల నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు ఎలాంటి ప్రదేశాలకు వెళ్తున్నారో 'న్యూస్‌టుడే' కథనం.

**కుటుంబ సభ్యులతో కలిసి పర్యటనలు ■ దసరా సెలవుల సద్వినియోగం**

### ఆధ్యాత్మిక, పర్యాటక..

■ ఉమ్మడి జిల్లాలో ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇష్టమైన దైవ దర్శనాలు చేసే కోసం పుణ్యంతోపాటు మనసు కుదుట పడుతుందని భావిస్తున్నారు.

■ ఒకరికి దూరంగా, ప్రకృతి రమణీయ ప్రాంతాలకు వెళ్తున్నారు. మన వద్ద ఇష్టమైన ప్రదేశాలు తక్కువే. రెండ్రోజులు గడిపే విధంగా అనువైన ప్రాంతాలు లేవు. నాగార్జునసాగర్, పాపికొండలు, విశాఖపట్నం, అరకు, తమిళనాడు, కేరళలాంటి ప్రాంతాలను చుట్టేస్తున్నారు.

■ బడ్జెట్, సమయం చూసుకొని తిరుపతితోపాటు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. తీర్థయాత్రలకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వారణాసి, అయోధ్య ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయని తెలుసుకొని చాలామంది అక్కడికి వెళ్తున్నారు.

■ మరికొందరు విదేశాలకు వెళ్తున్నారు. ఎక్కువ మంది సింగపూర్, మలేషియా, శ్రీలంక, దుబాయ్, థాయ్‌లాండ్ తదితర దేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపిస్తున్నారు. మిత్రులతో కొందరు, కుటుంబీకులతో మరికొందరు వెళ్తున్నారు.

### పర్యాటక వాహనాలకూ డిమాండ్

■ ఉమ్మడి జిల్లాలోని ప్రాంతాలను, ఇతర జిల్లాలోని ఆలయాలను ఒక రోజులో చుట్టేసి వస్తున్నారు. సొంత కార్లు ఉన్నవారే కాకుండా.. అద్దె వాహనాలు తీసుకొని వెళ్లి వీటి అందాలు చూసి వస్తున్నారు.

■ మరికొందరు కార్డీలియా క్రూజ్ టూరు ఇష్టపడుతున్నారు. సముద్రంలో ఓడలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముంబయి నుంచి గోవాకు, గోవా నుంచి చెన్నై, చెన్నై నుంచి శ్రీలంకకు వెళ్లేందుకు పర్యాటక ప్యాకేజీలున్నాయని ఒక ట్రావెల్ ఏజెన్సీకి చెందిన వర్ర శ్రీకాంత్ తెలిపారు.






### మరచిపోలేని మలేషియా పర్యటన

ఇటీవల మిత్రులతో కలిసి మలేషియా పర్యటనకు వెళ్లాం. మలేషియా నుంచి విమానంలో గంట ప్రయాణం చేస్తే లంకావి అనే ప్రాంతం వస్తుంది. ఇక్కడ ఎత్తులో అడుగుల ప్రయాణించిన తర్వాత సూర్యాస్తమయం దగ్గర నుంచి చూసే అవకాశముంది. ప్రపంచంలోని చాలామంది పర్యాటకులు దీనిని చూసేందుకు వస్తుంటారు. స్కై బ్రిడ్జి కారు, సముద్రంలో లోపల ఉన్న మ్యూజియంలో రకరకాల చేపలు చూసి ఆశ్చర్యపోవాల్సిందే. ఇక్కడి బాటు కేవ్స్‌లో మన హిందూ దేవాలయాలు ఉంటాయి. సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం చూడదగినది. ట్విన్ టవర్స్ ప్రాంతంలో ఎంజాయ్ చేశాం. ఈ పర్యటన జీవితాంతం గుర్తుండేటట్టు కాకుండా మంచి అనుభూతి కల్గించింది.



మలేషియా ట్విన్ టవర్స్ వద్ద శ్రీపాల్‌రెడ్డి

# వీరి ప్రదర్శన చూస్తే.. ఔరా అనాల్సిందే!

**అకాడ శిక్షణలో అబ్బుర పరుస్తున్న చిన్నారులు**

న్యూస్‌టుడే, జ్యోతినగర్, మార్కండేయ కాలనీ

కనుమరుగవుతున్నాయి అనుకుంటున్న ప్రాచీన యుద్ధ కళలు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. కర్రసాము, కత్తిసాముతో సాహస విన్యాసాలు చేస్తూ యుద్ధ విద్యను నేర్చుకుంటున్నారు ఈ చిన్నారులు. దసరా సందర్భంగా ఎన్టీపీసీకి చెందిన కంది రాజయ్య జ్ఞాపకార్థంగా అతని కుమారుడు శ్రీహనుమాన్ అకాడ శిక్షకులు కంది నాగరాజు ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా ఉచితంగా స్థానిక విశ్వభారతి ఉన్నత పాఠశాలలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణిస్తున్నారు. ఈ కేంద్రానికి చిన్నారులు తరలివచ్చి శిక్షణ పొందుతున్నారు.

**పలు అంశాల్లో..**

అకాడలో శిక్షణ నేర్చుకుంటున్న బాల, బాలికలకు కత్తి, కర్రసాము, తలపై కొబ్బరికాయ పగలగొట్టడం, కడుపుపై అరటిపండును కత్తితో కోయడంతోపాటు ఇతర విన్యాసాలు శిక్షణలో భాగం. దీంతో ప్రతి ఒక్కరికి ఆత్మస్థైర్యం పెరగడంతోపాటు ముఖ్యంగా ఏకాగ్రత పెరుగుతోంది. ఆత్మరక్షణ పొందే పలు అంశాలపై పట్టు లభిస్తుంది. ప్రతి విజయదశమి సందర్భంగా చిన్నారులకు విన్యాసాలు నేర్పడంతోపాటు ఉత్సవాల్లో ప్రతిభను ప్రదర్శిస్తూ మన్ననలు అందుకుంటున్నారు.



చిన్నారులకు కత్తి, కర్రసాము శిక్షణ ఇస్తున్న కోచ్ నాగరాజు

### యుద్ధ విద్య అవసరం..

**- హరిణి, విద్యార్థిని**



యుద్ధ విద్య నేర్చుకుంటే ఎటువంటి ఆపద నుంచి అయినా బయటపడవచ్చు. దేశంలో సంస్కృతి, సంప్రదాయాల కొనసాగింపులో భాగంగా ఆనవాయితీగా వస్తున్న కళలను ప్రోత్సహించడంతోపాటు యుద్ధ విద్య ద్వారా ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఈ విద్య ముఖ్యంగా అమ్మాయిలకు అవసరం.

### ప్రాచీన కళను వెలికితీయాలని..

**- కంది నాగరాజు, అకాడ శిక్షకులు**

ఆంగ్లేయుల కాలంలో జమీందారీలు ఈ విద్యను ప్రోత్సహించేవారు. విజయనగర సామ్రాజ్యంలో సంస్థాన సామంతరాజు కత్తి, కర్రసాములను జౌత్సాహిక ప్రదర్శనలుగా చేపట్టేవారు. యుద్ధ విద్యతో ప్రతి ఒక్కరికి మరింత నైపుణ్యం, గెలుపు, ఆత్మవిశ్వాసం, శరీర ఆకృతి, ఆత్మరక్షణ పెరుగుతుంది. ప్రాచీన యుద్ధ విద్యను పలువురికి నేర్పి పూర్వ వైభవాన్ని తీసుకురావడమే నా లక్ష్యం.

### కర్రసాముపై ఆసక్తి.. - నిస్సీ, విద్యార్థిని



చిన్నప్పటి నుంచి కర్రసాము అంటే ఇష్టం. సాధారణంగా చరవాణిలో కర్ర, కత్తిసాము ప్రదర్శనలు చూస్తుంటే నాతో సాధ్యమవుతుందా అనే ఆలోచన వచ్చేది. నా ఆసక్తికనుగుణంగా ఉచితంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకునే దిశగా అకాడలో చేరాను. ప్రస్తుతం కర్ర, కత్తిసాము సాధన చేస్తున్నా. ఏదైనా నేర్చుకోవాలన్న తపన, సాధన చేస్తే తప్పనిసరిగా విజయం సాధిస్తాం.

# గీత కార్మికులందరికీ రక్షక కవచాలు

**కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలోని దాదాపు 2 లక్షల మంది గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాలను అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం కరీంనగర్-రామగుండం బైపాస్ రోడ్డులోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో గీత కార్మికులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన కాటమయ్య రక్షక కిట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ఈ రోజు వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో 10 వేల కిట్లు పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో వెయ్యి మంది గీత కార్మికులకు కిట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చామన్నారు. హైదరాబాద్ ఐఐటీ వారు ఈ కిట్టు నాణ్యతను ధ్రువీకరించారన్నారు. జారి పడిపోకుండా జాకెట్ రక్షిస్తుందని, ఓ గీత కార్మికుడు మంత్రి, కలెక్టర్ సమక్షంలో ప్రదర్శించి చూపించారు.

**నాలుగు పాఠశాలలకు శంకుస్థాపన..:** రాష్ట్ర ప్రభుత్వం మరో కొత్త పథకాన్ని ప్రారంభిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో హుస్నాబాద్, ధర్మపురి, మానకొండూరు, మంథనిలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్' పాఠశాలల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న వసతిగృహాలను, గురుకులాలను జిల్లా కలెక్టర్‌తోపాటు అధికారులు సందర్శించాలన్నారు. మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, ఆబ్కారీ శాఖ పర్యవేక్షకులు శ్రీనివాసరావు, బీసీ సంక్షేమాధికారి అనిల్ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణగౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస గౌడ్, కార్పొరేటర్ ఐలేందర్, గౌడ సంఘ నాయకులు ఆదర్శ సత్యనారాయణ గౌడ్, తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు.



గీత కార్మికుడికి కాటమయ్య రక్షక కవచాన్ని అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, అధికారులు

## ఆర్టీసీ బస్సు ఢీకొని హోంగార్డు దుర్మరణం



సుబ్బరాజు

**మెట్‌పల్లి, న్యూస్‌టుడే:** ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో హోంగార్డు దుర్మరణం చెందిన ఘటన మెట్‌పల్లి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లికి చెందిన ఓంకారం సుబ్బరాజు(43) జగిత్యాల గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం పట్టణ శివారులోని హోటల్ నుంచి అల్పాహారం తీసుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఆర్మూర్ వైపు నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న నిజామాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్బరాజు తల పైనుంచి బస్సు వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సుబ్బరాజుకు భార్య, కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. సీఐ, హోంగార్డు ఆర్ఎస్సై సుమన్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

## ఎస్సారెస్పీ స్పిల్‌వే గేట్ల మూసివేత

**జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే:** శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 11,590 క్యూసెక్కులకు తగ్గటంతో స్పిల్‌వేగేట్లను మూసివేశారు. ఎస్కేప్‌గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతుండగా వరదకాలువకు నీటివిడుదలను 2 వేల క్యూసెక్కులకు తగ్గించారు. కాకతీయ తదితర కాలువలు, ఎత్తిపోతలు, మిషన్ భగీరథ అవసరాలు కలుపుకుని మొత్తం ఔట్‌ఫ్లో 11,590 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీటినిల్వ, 1091.0 అడుగుల నీటిమట్టం ఉంది.



# రెండు బ్యాచ్‌లు.. 48 మందికి కొలువులు

**డీఎస్సీలో సత్తాచాటిన కరీంనగర్ డైట్ విద్యార్థులు**

న్యూస్‌టుడే-కరీంనగర్ విద్యావిభాగం

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీలోని డైట్ కళాశాలలో డీఎడ్ పూర్తి చేసిన ఒకే బ్యాచ్‌కు చెందిన అభ్యర్థుల్లో ఎక్కువ మంది డీఎస్సీ-2024లో ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికై ప్రత్యేకత చాటుకున్నారు. 2015-17 బ్యాచ్ అభ్యర్థులు 28 మంది (25 మంది ఎస్జీటీలుగా, ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లుగా) కొలువులు సాధించారు. ఆ బ్యాచ్‌లో వంద మంది ఉండగా, ఈ ఏడాది జరిగిన డీఎస్సీకి హాజరైన ఆ బ్యాచ్‌లోని 28 మంది తమ కలను నిజం చేసుకున్నారు. వీరిలో ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల వారు ఉన్నారు. ఇదే కళాశాలలో చదివిన 2014-16 బ్యాచ్ విద్యార్థులు 20 మంది ఉద్యోగాలు సాధించారు. వివిధ జిల్లాలకు చెందిన వీరు మంగళవారం హైదరాబాద్‌లో నియామక పత్రాలను అందుకున్న సందర్భంగా కలుసుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఇదే కళాశాలలో చదివిన మరో బ్యాచ్ అభ్యర్థిని హనుమకొండ జిల్లాలో ఎస్జీటీ టాపర్‌గా, మరో అభ్యర్థిని కరీంనగర్ జిల్లా టాపర్‌గా నిలవడం గమనార్హం. అధ్యాపకుల బోధన, వారి ప్రోత్సాహం ఉద్యోగాల సాధనకు ఉపయోగపడిందని పలువురు తెలిపారు. ఉద్యోగాలు సాధించినవారిని డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.మొండయ్య, అధ్యాపకులు డాక్టర్ శంకర్, సి. హెచ్.ప్రద్యుమ్నకుమార్, మహేశ్వర్‌రెడ్డి, మంజుల తదితరులు అభినందించారు.



ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 2015-17 డీఎడ్ బ్యాచ్ అభ్యర్థులు



2014-16 డీఎడ్ బ్యాచ్ అభ్యర్థులు

### అన్నా చెల్లెళ్లకు ఒకేసారి..



సుస్మిత, సురేష్

**ముత్తారం, న్యూస్‌టుడే:** మండలంలోని కేశనపల్లికి చెందిన అన్నాచెల్లెలు ఒకేసారి ఉపాధ్యాయ కొలువులు సాధించారు. కేశనపల్లికి చెందిన కోళ్ల రాధ-కొమురయ్యలకు ముగ్గురు సంతానం. వీరు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో చిన్న కొడుకు సురేష్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో, కూతురు సుస్మిత ఎస్జీటీలో రెండో ర్యాంక్ పొందారు. ప్రస్తుతం సురేష్ జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గురుకులంలో విధులు నిర్వహిస్తున్నాడు.

### శ్రమించారు.. కలిసి కొలువు సాధించారు



సతీశ్, మౌనిక దంపతులు

**సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన దంపతులు గుంటుకు సతీశ్, గజ్జెల్లి మౌనికలు డీఎస్సీ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. వీరికి 2019లో వివాహం జరిగింది. ఒక పాప ఉంది. సతీశ్ ఓ చిట్‌ఫండ్స్ కంపెనీలో పని చేసేవాడు. 2017లో డీఎస్సీ రాసినప్పటికీ రాలేదు. మౌనిక ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పని చేసేది. ఇద్దరూ ఉద్యోగాలకు రాజీనామా చేసి రెండు సంవత్సరాల పాటు పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఇందుకు ఆర్థికంగా ఇరువురి కుటుంబ సభ్యులు సహాయపడ్డారు. పాపను సతీశ్ లేదా మౌనిక తల్లిదండ్రులు చూసుకునేవారని, అందువల్లే తాము పూర్తిగా చదువుపై శ్రద్ధ పెట్టగలిగామని చెబుతున్నారు. సిరిసిల్లలోని సినారె గ్రంథాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు పుస్తకాలతో కుస్తీ పట్టి లక్ష్యాన్ని సాధించారు. గ్రంథాలయం వద్ద అన్నపూర్ణ క్యాంటీన్‌లో అందించే రూ.5 భోజనం తింటూ చదువుకున్నారు. వీరి స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి పాఠ్యాంశాలపై ఎప్పటికప్పుడు చర్చించుకునేవారు. ఇది బాగా ఉపయోగపడిందని చెప్పారు. పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని చెబుతున్నారు ఈ దంపతులు.

### కష్టాలకు ఎదురొడ్డి.. లక్ష్యాన్ని చేరుకొని



స్వప్న

**కరీంనగర్ కలెక్టరేట్, కొత్తపల్లి, న్యూస్‌టుడే:** చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించింది ఆ యువతి. తండ్రి చిన్నప్పుడే చనిపోగా.. తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. అయినా మొక్కవోని ధైర్యంతో లక్ష్యం వైపు అడుగులేసి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి తన కలను సాకారం చేసుకొంది కరీంనగర్ శివారు కొత్తపల్లికి చెందిన స్వప్న. దూస శారద-లక్ష్మీరాజం దంపతులకు ముగ్గురు కూతుళ్లు. వారిలో చిన్న కూతురు స్వప్న. అక్కలిద్దరవి పెళ్లిలు కాగా.. వేరే ప్రాంతాల్లో ఉంటున్నారు. స్వప్న చిన్నప్పటి నుంచి సర్కారు బడుల్లోనే చదువుకుంది. అక్కడ పాఠాలు బోధించే ఉపాధ్యాయులను చూసి, ఆ ఉద్యోగం సాధించాలని ఆశయంగా పెట్టుకుంది. తండ్రి చిన్నప్పుడే మరణించగా.. తల్లి బీడీలు చుడుతూ చదివించింది. స్వప్న ఇంటి వద్ద ట్యూషన్లు చెప్పేది. డీఎస్సీ నోటిఫికేషన్ అనంతరం తల్లి సైతం మరణించింది. ఓ వైపు దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్షకు సిద్ధమైంది. ఇటీవల విడుదలైన ఎస్జీటీ ఫలితాల్లో 18వ ర్యాంకు సాధించింది. బుధవారం హైదరాబాద్‌లో ఉద్యోగ నియామక పత్రం అందుకుంది.

### కూలీ నుంచి ఉపాధ్యాయుడిగా..



నిరుపేద కుటుంబం.. ఉండటానికి సరైన గూడు లేదు.. పనిచేస్తేనే పూట గడిచే పరిస్థితి.. ఓ వైపు కూలీ పనికి వెళ్తూనే పోటీ పరీక్షలకు సన్నద్ధమై ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ మేజర్ గ్రామానికి చెందిన పాశం శంకర్-గంగు దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు. వీరి కుమారుడు ప్రశాంత్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. 6 నుంచి 12 వరకు మేడిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివాడు. టీటీసీలో సీటు రాగా సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లిలో 2017-19లో పూర్తిచేశాడు. తండ్రి శంకర్ కూలీ పనులకు వెళ్తుండగా తల్లి అనారోగ్యంతో ఇంటికే పరిమితమైంది. తండ్రి కూలీ పనులకు వెళ్తేనే పూటగడిచేది. దీంతో ప్రశాంత్ పెయింటింగ్‌తో పాటు కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. ఉదయం కూలీ పనికి వెళ్తూ రాత్రిళ్లు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా ఎంపికయ్యాడు. బుధవారం ఉపాధ్యాయ నియామక పత్రం అందుకోగా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషంలో మునిగిపోయారు. **- న్యూస్‌టుడే, కోరుట్ల**

### మట్టిలో మాణిక్యాలు



వేణుగోపాల్

**శంకరపట్నం :** కేశవపట్నం గ్రామానికి చెందిన హమాలీ, కూలీల బిడ్డలు ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువులు సాధించారు. కేశవపట్నం గ్రామానికి చెందిన జూల వెంకటలక్ష్మి-శ్రీనివాస్ దంపతుల కుమారుడు వేణుగోపాల్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి, హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, కరీంనగర్‌లో డిగ్రీ, బీఎడ్ చేశారు. తండ్రి శ్రీనివాస్ హమాలీ కార్మికుడు కాగా.. తల్లి వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కొడుకు వేణుగోపాల్‌ను చదివించారు. వేణుగోపాల్ సైతం సోదరుడితో కలిసి ఖాళీ సమయాల్లో వేడుక మందిరాల్లో డెకరేషన్‌గా కూలీ పనులు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. కూలీ పనులు చేస్తూ ఓ పక్క ప్రభుత్వ ఉద్యోగం కోసం శ్రమించారు. ఇంటి వద్దనే ఉండి డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యారు. డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్) ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదటిసారి 2017లో డీఎస్సీ పరీక్ష రాసి ఉద్యోగానికి ఎంపిక కాలేదనే నిరుత్సాహం అతడిలో ధైర్యం నింపింది. రెండో ప్రయత్నంలో వేణుగోపాల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసి చదివించిన కష్టానికి ఫలితం దక్కిందని వేణుగోపాల్ పేర్కొన్నారు.



ప్రశాంత్

■ కేశవపట్నం గ్రామానికి చెందిన గొడిశాల ప్రశాంత్ తండ్రి తిరుపతి రైసుమిల్లులో కూలీ కాగా, తల్లి మాలతి రోజువారీ కూలీగా పని చేసేవారు. తాము పడ్డ కష్టం తమ కుమారుడు పడొద్దని బాగా చదవమనేవారు. ప్రశాంత్ స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి, హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ విద్యాభ్యాసం చేశారు. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదివిన ప్రశాంత్ టీటీసీ, బీఎడ్ పూర్తి చేశారు. డీఎస్సీ ఫలితాల్లో 72.27 మార్కులతో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు.

# పండగపూట స్తంభంపల్లిలో విషాదం

**తేనెటీగల దాడిలో రైతు మృతి ■ మరో ముగ్గురికి తీవ్ర గాయాలు**



లచ్చిరెడ్డి

**బోయినపల్లి, న్యూస్‌టుడే:** పంట పొలాల వద్ద పనులు చేసుకుంటున్న రైతులపై తేనెటీగలు దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం స్తంభంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కందాడి లచ్చిరెడ్డి (60), అతని కొడుకు నవీన్ రెడ్డి, మరో ఇద్దరు రైతులు రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డిలు తమ వ్యవసాయ పొలాల్లో పనులు చేసుకుంటున్నారు. సమీపంలోని చెట్టుపై కొమ్మ విరిగి తేనెటీగలపై పడటంతో ఒక్కసారిగా లేచాయి. పొలంలో పనులు చేసుకుంటున్న లచ్చిరెడ్డి, నవీన్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజిరెడ్డిలపై దాడి చేశాయి. వాటి నుంచి కాపాడుకోవడానికి పరుగు తీసి మంట పెట్టే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. లచ్చిరెడ్డి, నవీన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తీవ్రంగా గాయపడటంతో వేములవాడలోని ఓ ఆసుపత్రికి తరలించారు. లచ్చిరెడ్డిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. పండగ రోజు రైతు మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై పృథ్వీధర్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. లచ్చిరెడ్డికి భార్య వినోద, కొడుకు నవీన్‌రెడ్డి, కూతురు రజిత ఉన్నారు.

## యువకుడి దారుణ హత్య

### వివాహేతర సంబంధమే కారణమా?



వినయ్‌కుమార్

**యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే:** గోదావరిఖని యైటింక్లయిన్ కాలనీ హనుమాన్‌నగర్‌లో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వివాహేతర సంబంధమే కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. హనుమాన్‌నగర్‌కు చెందిన వడ్డాది వినయ్‌కుమార్(25) స్కావెంజర్‌గా విధులు నిర్వహించేవాడు. ఖనికి చెందిన ఓ వివాహితతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఆమె భర్త, పిల్లలను వదిలి మూడు నెలలుగా వినయ్‌కుమార్‌తో కలిసి ఉంటోంది. గురువారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు.. ఆయుధాలతో వినయ్‌కుమార్‌పై దాడిచేయడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తన కుమారుడిని వివాహిత సోదరుడు, భర్త కలిసి హత్య చేశారని మృతుడి తండ్రి కుమారస్వామి పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ రమేష్ పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకుని ఆడి పాడారు. గౌరీదేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. అనంతరం సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు.

**- న్యూస్‌టుడే యంత్రాంగం**


మల్లారంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


అమ్మవారి రూపంలో అలంకరించిన బతుకమ్మ


లింగంపల్లిలో...


గంభీరావుపేటలో...


ఆర్యవైశ్య భవనంలో...


పోత్గల్‌లో...




మానాలలో..


ఇల్లంతకుంటలో...


బతుకమ్మను తీసుకొస్తూ...


ఎల్లారెడ్డిపేట పాత బస్టాండు ప్రాంతంలో...


మామిడిపల్లిలో...


కోనరావుపేటలో...


మార్కండేయ ఆలయం ఎదుట...


మానాలలో...


ఎల్లారెడ్డిపేటలో


మండెపల్లిలో...


వాయినం ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు


కొదురుపాకలో...


రాచర్ల గొల్లపల్లిలో...


సుభాష్‌నగర్‌లో...


రాచర్ల బొప్పాపూర్‌లో...


వన్‌పల్లిలో...


భారీ వర్షంతో నిలిచిన బతుకమ్మ ఆట


బోయినపల్లిలో...


మల్లాపూర్‌లో...


గంభీరావుపేటలో...

**మేమున్నాం.. మీకు తోడుగా...** (10 AM TO 1 PM)
వీర్నపల్లి: 91541 18151
బోయినపల్లి: 84999 90001

## మురుగు కాలువ శుభ్రం



ఈనాడు స్పందనకు వందనం

**సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే:** సిరిసిల్లలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కార్గిల్ చెరువులోని వరద సాయినగర్ ప్రధాన కాలువలోకి రావడంతో మురుగు, మట్టితో నిండిపోయింది. దీనితో దుర్గంధం రావడంతో పాటు ఈగలు, దోమల బెడద పెరిగింది. దీనిపై ఈ నెల 8న 'ఈనాడు'లో మేమున్నాం... మీకు తోడుగా' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించి కాలువలోని మురుగు, మట్టిని తొలగించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.


## పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మాజీ ఎంపీపీ

**బోయినపల్లి, న్యూస్‌టుడే:** పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీని గురువారం పీసీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్‌తో కలిసి హైదరాబాద్‌లో కలిసినట్లు మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ తెలిపారు. పుష్ప గుచ్ఛం అందించి సన్మానించినట్లు చెప్పారు.


పీసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడితో మాజీ ఎంపీపీ

## తండ్రి సంరక్షణ చూసుకోని కొడుకుకు నోటీసు జారీ
### వారం రోజుల్లో ఇల్లు ఖాళీ చేయాలని ఆదేశం

**తంగళ్లపల్లి, న్యూస్‌టుడే:** తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్‌లో ఉంటున్న అడువాల రాజమల్లుకు కుమారులు నరేశ్, అనిల్‌కుమార్ ఉన్నారు. వీరిద్దరికీ రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయి. అయితే వీరు తండ్రి పోషణను పట్టించుకోకపోవడంతో సీనియర్ సిటిజన్ చట్టం-2007 నిర్వహణ, సంక్షేమం చట్ట ప్రకారం వారికి తహసీల్దార్ నోటీసులు జారీ చేసి విచారించారు. చిన్న కుమారుడు సురేశ్ పొరపాటు అయిందని, తండ్రిని జాగ్రత్తగా చూసుకుంటానని అధికారుల సమక్షంలో ఒప్పుకొన్నాడు. పెద్ద కుమారుడు అనిల్‌కుమార్ మాత్రం ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో తనకు కేటాయించిన రెండు పడక గదుల ఇల్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారం రోజుల్లో ఖాళీ చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా ఇద్దరు కుమారులు తండ్రికి చెరో రూ. 2 వేలు ఇవ్వాలని సూచించారు. తదుపరి ఆ ఇంటిని రాజమల్లు పేరు మీద మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇస్తామని తహసీల్దార్ జయంత్‌కుమార్ తెలిపారు.


అనిల్‌కుమార్‌ను ఆదేశిస్తున్న తహసీల్దార్ జయంత్‌కుమార్

## ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

**వేములవాడ, న్యూస్‌టుడే:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేములవాడ నియోజకవర్గంలో గురువారం రూ.12 లక్షలకు ఆరు ఎల్‌వోసీలను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. వారం క్రితం ఒకే రోజు రూ.11 లక్షలకు 5 ఎల్‌వోసీలను బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# పాలకవర్గాల ప్రమాణ స్వీకారం

**వీర్నపల్లి, న్యూస్‌టుడే:** వీర్నపల్లి మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పడిన ఏఎంసీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఛైర్మన్ లకావత్ రాములు నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీహరి, వైస్ ఛైర్మన్ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు తిరుపతి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్, నాయకులు సంతోష్, దేవరాజు, నరేశ్, మదన్, చంద్రమౌళి, కాంతయ్య, మంజుల, శ్రీనివాస్, శివరామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం, డైరెక్టర్లు

**గంభీరావుపేట:** గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం గురువారం బాధ్యతలను స్వీకరించింది. అధ్యక్షురాలు కొమిరిశెట్టి విజయ, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డితో పాటు డైరెక్టర్లు బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

**సిరిసిల్ల గ్రామీణం:** సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం గురువారం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్షురాలుగా వెలుముల స్వరూప, వైస్ ఛైర్మన్‌గా నేరెళ్ల నర్సింగంగౌడ్, 11 మంది డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


గంభీరావుపేట పాలకవర్గం

**రాచర్ల బొప్పాపూర్ (ఎల్లారెడ్డిపేట):** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం గురువారం బాధ్యతలు స్వీకరించింది. కమిటీ ఛైర్‌పర్సన్ షేక్ సాబేరాబేగం, వైస్ ఛైర్మన్ గుండాటి రాంరెడ్డి, డైరెక్టర్లు బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు నేవూరి వెంకట్‌రెడ్డి, దత్తాద్రిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వీర్నపల్లి మార్కెట్ కమిటీ సభ్యులు


సిరిసిల్ల...

## అభివృద్ధిలో రాజీపడేది లేదు

**గంభీరావుపేట, న్యూస్‌టుడే:** గంభీరావుపేట మండల అభివృద్ధి విషయంలో రాజీ పడేది లేదని, అన్ని విధాలుగా మండలాన్ని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ తెలిపారు. గంభీరావుపేట మండల కేంద్రంలో హైమాస్ట్ దీపాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ సందర్భంగా ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ దీపాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గంభీరావుపేటను అభివృద్ధిలో ముందు ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొమిరిశెట్టి విజయ, డైరెక్టర్లు కోటలింగం, ఎడబోయిన ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

## రతన్ టాటా మృతికి సంతాపం

**వేములవాడ, న్యూస్‌టుడే:** వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతి పట్ల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భారతీయుల గుండెల్లో చెరగని ముద్రవేసిన గొప్ప వ్యాపార వేత్త అని పేర్కొన్నారు.

## తపాలా ఉద్యోగికి సన్మానం

**సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే:** జాతీయ తపాలా దినోత్సవం పురస్కరించుకొని సిరిసిల్ల పట్టణంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తపాలా ఉద్యోగి రెడ్డిమల్ల కొండయ్యను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేముల మార్కండేయులు, సామల వెంకన్న, కనకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.


వేములవాడలో భక్తుల పూజలు | నిమ్మపల్లిలో... | రాచర్ల గొల్లపల్లిలో... | రాచర్ల బొప్పాపూర్‌లో...

## అమ్మవారికి ఘనంగా పూజలు

శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వివిధ గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారికి పురోహితుల మంత్రోచ్చారణల నడుమ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. **- న్యూస్‌టుడే బృందం**


గూడెంలో...


రాచర్ల గొల్లపల్లిలో ...

## గిరిజన సంప్రదాయాలు భావితరాలకు తెలియజేయాలి

**వీర్నపల్లి, న్యూస్‌టుడే:** అనాదిగా వస్తున్న గిరిజన సంప్రదాయాలు, ఆచారాలను భావితరాలకు తెలియజేయాలని సీఐడీ ఎస్పీ (కోర్టు మానిటరింగ్ సిస్టం, హైదరాబాద్) భూక్య రాంరెడ్డి పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం జవహర్‌లాల్‌నాయక్‌తండాలో గురువారం మేరామాయడీ ఏడో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భోగ్ బండార్ నిర్వహించి జగదాంబ అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. బంజారాల సంస్కృతిని కాపాడుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో గోర్‌సిక్‌వాడీ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, దర్శింగ్, శ్రీనివాస్, మహిపాల్, నవీన్, దేవేందర్, సేవ్యా తదితరులు పాల్గొన్నారు.


జవహర్‌లాల్‌నాయక్‌తండాలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు


తెర్లుమద్దిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేశ్

**ముస్తాబాద్, న్యూస్‌టుడే:** బతుకమ్మ పండగ సందర్భంగా మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్సై గణేశ్ హెచ్చరించారు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్దితోపాటు పలు గ్రామాల్లో ఎస్సై ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండగ నేపథ్యంలో పోలీసులు అన్ని గ్రామాల్లో మఫ్టీలో తిరుగుతారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల మండల ఫోరం మాజీ కన్వీనర్ కలకొండ కిషన్‌రావు, నాయకులు బైతి నవీన్, పుట్ట చంద్రయ్య, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈత చెట్ల తొలగింపుపై ఫిర్యాదు

**వేములవాడ, న్యూస్‌టుడే:** వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి శివారులో ఈత చెట్ల తొలగింపుపై గురువారం ఎక్సైజ్, పోలీసు అధికారులకు గీత కార్మికులు ఫిర్యాదు చేశారు. కొందరు స్థిరాస్తి వ్యాపారులు వ్యవసాయ బావి గడ్డపై ఉన్న దాదాపు పది ఈత చెట్లను జేసీబీతో తొలగించి దహనం చేసి భూమిని చదును చేశారని పేర్కొన్నారు. దీంతో తమకు ఉపాధి లేకుండా పోయిందని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని గీత కార్మికులు చింతపంటి రాజేశం, రామస్వామి కోరారు.

## ఐపీ దాఖలు చేసిన బెల్లం వ్యాపారి

**వేములవాడ, న్యూస్‌టుడే:** వేములవాడ పట్టణంలోని బెల్లం, కొబ్బరికాయల దుకాణం వ్యాపారి అప్పు ఇచ్చిన వారికి రెండు రోజుల క్రితం ఐపీ నోటీసులు పంపించడం పట్టణంలో చర్చనీయాంశమైంది. రాజన్న ఆలయం ముందు బెల్లం, కొబ్బరికాయల దుకాణం నిర్వహించే వ్యాపారి దాదాపు రూ. 2.5 కోట్లకు నోటీసులు పంపినట్లు తెలుస్తోంది. దీంతో వ్యాపారికి అప్పులిచ్చిన వారు లబోదిబోమంటున్నారు. దాదాపు ఏడుగురు వ్యక్తులకు వ్యాపారి నోటీసులు పంపినట్లు సమాచారం.

## పండగ పూట చోరీ

**సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే:** సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపం ఆటోనగర్‌లోని సాంబారి సతీశ్ ఇంటో గుర్తుతెలియని ఓ మహిళ గురువారం ఉదయం 11 గంటల సమయంలో చొరబడింది. సుమారు రూ. 25 వేల విలువైన చరవాణిని ఎత్తుకెళ్లింది. సీసీ ఫుటేజ్‌ని పరిశీలించగా సంజీవయ్యనగర్ వైపు వెళ్లినట్లు కనిపించడంతో వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు.


సీసీ ఫుటేజ్‌లో మహిళా దొంగ